క్లుప్తంగా

నైపుణ్య గణన సర్వేపై శిక్షణ



ఉయ్యూరు: నైపుణ్య గణన సర్వే సమర్థంగా నిర్వహించాలని ఉయ్యూరు కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు సూచించారు. స్థానిక మున్సిపల్ కార్యాలయంలో యువత నైపుణ్యగణన సర్వేపై శుక్రవారం సిబ్బంది శిక్షణ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సర్వే సిబ్బంది ఇంటింటికీ వెళ్లి 15-59 ఏళ్లలోపు ప్రజల నైపుణ్యాల వివరాలను సేకరించాలని సూచించారు. మండల పరిషత్ కార్యాలయంలోనూ నైపుణ్య గణన సర్వే శిక్షణ ఇచ్చారు. ఎంపీడీఓ శేషగిరిరావు సిబ్బందికి శిక్షణ వివరాలు తెలిపారు. కార్యక్రమంలో సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా రేడియాలజీ దినోత్సవం



ఉయ్యూరు: లయన్స్ క్లబ్ ఆఫ్ ఉయ్యూరు ఆధ్వర్యంలో అంతర్జాతీయ రేడియాలజీ దినోత్సవాన్ని శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రముఖ రేడియాలజిస్ట్ డాక్టర్ ఎస్‌కే. కరీమ్‌ను సత్కరించి ఆయన సేవలను కొనియాడారు. లయన్స్ జిల్లా కేబినెట్ డెప్యూటీ సెక్రటరీ నూకల వెంకట సాంబశివరావు మాట్లాడుతూ సమాజంలో రేడియాలజిస్ట్‌ల పాత్ర ఎంతో కీలకమన్నారు. వ్యాధి నిర్ధారణలో రేడియాలజిస్ట్‌ల సేవలు ప్రశంసనీయమని అన్నారు. కార్యక్రమంలో లయన్స్ జోనల్ చైర్మన్ ఎండీ ఇస్మాయిల్, ప్రతినిధులు డాక్టర్ రావులపల్లి సుధాకర్, నెల్లి రాంబాబు, నల్లా శ్రీనివాస్, హసన్ అహ్మద్ పాల్గొన్నారు.

వైభవంగా సామూహిక కుంకుమార్చనలు



దావాజిగూడెం(గన్నవరం): మండలంలోని దావాజీగూడెంలో వేంచేసియున్న శ్రీసీతారామ చంద్రస్వామి దేవస్థానంలో కార్తిక మాస పూజలు వైభవంగా జరుగుతున్నాయి. ఆలయ అర్చకుడు చావలి మురళీకృష్ణశర్మ ఆధ్వర్యంలో శుక్రవారం 108 కిలోల కుంకుమతో స్వామివారికి అభిషేకాలు, అర్చనలు చేశారు. అనంతరం పెద్ద సంఖ్యలో తరలివచ్చిన స్త్రీలు సామూహిక కుంకుమార్చనలు నిర్వహించారు. ఆలయ కమిటీ ఆధ్వర్యంలో భక్తులకు ప్రసాద వితరణ జరిగింది. పలువురు గ్రామ ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.

మహిళా రక్షణపై అవగాహన



ఉయ్యూరు: చెడు అలవాట్లకు దూరంగా ఉండాలని ఉయ్యూరు రూరల్ ఎస్‌ఐ సురేష్‌బాబు అన్నారు. మండలంలోని కలవపాముల జ్యోతి పాలిటెక్నిక్ కళాశాలలో శుక్రవారం ఈవ్ టీజింగ్, ర్యాగింగ్, సైబర్ క్రైమ్, మహిళా రక్షణ అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఎస్‌ఐ సురేష్‌బాబు మాట్లాడుతూ ర్యాగింగ్‌కు పాల్పడితే భవిష్యత్తు అంధకారమేనన్నారు. మాదకద్రవ్యాల వినియోగం, ర్యాగింగ్ చట్టరీత్యా నేరమని తెలిపారు. క్రమశిక్షణతో విద్యనభ్యసించాలని సూచించారు. కార్యక్రమంలో కళాశాల చైర్మన్ సూరపనేని వెంకటరమణ, ప్రిన్సిపాల్ జన్ను శివ కుమార్ పాల్గొన్నారు.

మద్యం తరలిస్తున్న ఇరువురు అరెస్ట్

ఉంగుటూరు: ఉంగుటూరు పరిధిలోని ముక్కపాడు, పొణుకుమాడు గ్రామాలకు అక్రమంగా మద్యం తరలిస్తున్న ఇద్దరు వ్యక్తులను శుక్రవారం పోలీసులు అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు.. అక్రమంగా మద్యం తరలిస్తున్నారనే సమాచారంతో ముక్కపాడులో చలపతిరావును అదుపులోకి తీసుకుని 35 క్వార్టర్ సీసాలు, పొణుకుమాడులో పుల్లమ్మను అదుపులోకి తీసుకుని 18 సీసాలు స్వాధీనం చేసుకున్నారు. ఈ ఘటనలపై ఎస్‌ఐ గోవిందు కేసు నమోదు చేశారు.

ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్లు

- రక్షణ వలయాలు లేక వేలాడుతున్న విద్యుత్ వైర్లు
- భయాందోళన చెందుతున్న ప్రజలు

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలంలోని పలు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారాయి. రామవరప్పాడు, ప్రసాదంపాడు, ఎనికేపాడు, నిడమానూరు, గూడవల్లి గ్రామాల్లో మొత్తం కలిపి సుమారు 1,400 ట్రాన్స్‌ఫార్మర్లు ఉన్నాయి. పలు గ్రామాల్లోని అంతర్గత రహదారుల్లో ఎప్పటి నుంచో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకర స్థితికి చేరుకున్నాయి. ముఖ్యంగా ఫ్యూజు బాక్సులకు రక్షణ కవచాలు లేకపోవడం, తీగలు రహదారికి కిందకు వెలాడుతుండటంతో ప్రమాదాలు జరుగుతున్నాయి. ఎక్కువగా జనసంచారం ఉన్న కూడళ్లలో ఇటువంటి ట్రాన్స్‌ఫార్మర్లతో ఇబ్బందులు పడుతున్నామని ఆయా గ్రామస్తులు ఆందోళన చెందుతున్నారు. చిన్నపిల్లలకు సైతం చేతులకు అందే ఎత్తులో ఇవి ఉంటున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం ముంచుకొస్తుందోనని ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.

వేసవిలో మరింత ప్రమాదం

ఎండాకాలంలో విద్యుత్ వినియోగం రెట్టింపు ఉండటంతో ట్రాన్స్‌ఫార్మర్లపై అదనపు భారం పడుతుంది. దీంతో చేతులకు అందే ఎత్తులో ఉన్న ట్రాన్స్‌ఫార్మర్ల నుంచి ఒక రకమైన శబ్దం వస్తుందని ఆయా గ్రామాల ప్రజలు చెబుతున్నారు. ట్రాన్స్‌ఫార్మర్ల సమీపంలోని స్థలాల్లో పిల్లలు ఆడుకుంటుంటారని దీంతో జరగరానిది



రామవరప్పాడు రాజుల బజార్‌లో ప్రమాదకరంగా ట్రాన్స్‌ఫార్మర్

ఏమైనా జరుగుతుందేమోననే భయం గుప్పిట్లో ఉన్నామని వాపోతున్నారు. పైగా పలు గ్రామాల్లో ట్రాన్స్‌ఫార్మర్ల చుట్టూ సమీప నివాసితులు చెత్తను పడేస్తున్నారని వీటి నుంచి నిప్పు రవ్వలు రాలి చెత్తపై పడితే ప్రమాదం ఎంత తీవ్రంగా ఉంటుందోనని భయాందోళనలు వ్యక్తం చేస్తున్నారు.

రక్షణ కవచాలు ఏర్పాటు చేయాలి

ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్లను సంబంధిత అధికారులు గుర్తించి ఎత్తు పెంచాలని స్థానికులు కోరుతున్నారు. ఫ్యూజు బాక్సులకు రక్షణ కవచాలు ఏర్పాటు చేసి విద్యుత్ తీగలను పైన ఏర్పాటు చేయాలని డిమాండ్ చేస్తున్నారు.



ఇటీవల ఎనికేపాడులో యువకుడి మృతికి కారణమైన ట్రాన్స్‌ఫార్మర్

అనధికార కట్టడాలు

ట్రాన్స్‌ఫార్మర్ల ప్రమాదాలు ఎక్కువగా అనధికార కట్టడాల నుంచే పుట్టుకొస్తున్నాయి. నిబంధనలు అతిక్రమించి నిర్మించిన కట్టడాల వద్ద ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్లు ప్రమాదకరంగా మారుతున్నాయి. అపార్టుమెంట్లు, గ్రూప్ హౌస్‌లకు సెట్‌బ్యాక్‌లు వదలకుండా నిర్మించేస్తున్నారు. దీంతో ట్రాన్స్‌ఫార్మర్లను చేతికందే దూరంలోనే విద్యుత్ అధికారులు ఏర్పాటు చేయాల్సి వస్తోంది. ప్రహరీ గోడ మీదనో, రోడ్డు మీదనో ఏర్పాటు చేస్తున్న ట్రాన్స్‌ఫార్మర్లతో ఎక్కువగా ప్రమాదాలు సంభవిస్తున్నాయి. వీటి తీగలు పిట్ట గోడకు అతి సమీపంలో ఉంటున్నాయి. ఇటీవల ఎనికేపాడు జెండా చెట్టు సెంటర్‌లో ఓ అనధికార కట్టడం వద్ద రోడ్డుపై ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్ తీగలు తగిలి దర్శనాల వినోద్ అనే యువకుడు మృతి చెందిన విషయం విదితమే.


జనసంచారం ఎక్కువగా ఉన్న కూడళ్లు, ఖాళీ స్థలాల సమీపంలో నిర్లక్ష్యానికి గురైన ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ చర్యలు తీసుకోవాలని అధికారులను కోరుతున్నారు.

నోటీసులు ఇస్తున్నాం

గ్రూప్ హౌస్‌లు, అపార్టుమెంట్ల వద్ద ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్లను గుర్తించి సంబంధిత యజమానులకు నోటీసులిస్తున్నాం. వ్యక్తిగత ట్రాన్స్‌ఫార్మర్ల వద్ద రక్షణ కవచాలు ఏర్పాటు చేసుకోవాలని ఆదేశిస్తున్నాం. విద్యుత్ కార్యాలయానికి వస్తున్న ఫిర్యాదులను దృష్టిలో పెట్టుకుని ప్రమాదకరంగా మారిన ట్రాన్స్‌ఫార్మర్లకు రక్షణ కవచాలు ఏర్పాటు చేస్తున్నాం. గతంలో ఏర్పాటు చేసిన ట్రాన్స్‌ఫార్మర్లపై ప్రత్యేక దృష్టి పెట్టి ఎటువంటి ప్రమాదాలు జరగకుండా వాటి ఎత్తును పెంచుతాం.

– పరమేశ్వరరావు, విద్యుత్ ఏఈ, విజయవాడ రూరల్.

ఆత్మీయ కలయిక



కంకిపాడు: వైఎస్సార్ సీపీ అధినేత, మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డిని పెనమలూరు నియోజకవర్గ నేతలు శుక్రవారం ఆత్మీయంగా కలిశారు. వైఎస్సార్ సీపీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి, మహిళా విభాగం జిల్లా నేత మాదు శ్రీహరి రాణి, ప్రొద్దుటూరు గ్రామ అధ్యక్షుడు భీమవరపు నాగిరెడ్డి, పలువురు నేతలు జగన్‌ను కలిసి స్థానికంగా నెలకొన్న పార్టీ స్థితిగతులను వివరించారు.

కొత్త ఓటర్ల నమోదుకు ప్రత్యేక శిబిరాలు

కంకిపాడు: కొత్త ఓటర్ల నమోదు ప్రక్రియకు పోలింగ్ కేంద్రాల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నట్లు తహసీల్దార్ వి. భావన్నారాయణ తెలిపారు. శుక్రవారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ 2025 జనవరి ఒకటవ తేదీ నాటికి 18 ఏళ్లు నిండిన పౌరులు తప్పనిసరిగా ఓటు నమోదు చేసుకోవాలని సూచించారు. ఇందుకు గానూ అన్ని పోలింగ్ కేంద్రాల్లో ఈనెల 9, 10, 23, 24 తేదీల్లో ప్రత్యేక శిబిరాలు నిర్వహిస్తున్నామని పేర్కొన్నారు. బూత్ స్థాయి అధికారులు వివిధ రాజకీయ పార్టీ బూత్ స్థాయి ఏజెంట్లతో కలిసి అందుబాటులో ఉంటారని తెలిపారు. 18 ఏళ్లు నిండిన వారు తమ ఓటు హక్కు నమోదు చేసుకోవాలని సూచించారు.

ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధిలో హెచ్‌ఎంలదే కీలకపాత్ర

గన్నవరం: ప్రభుత్వ పాఠశాలల అభివృద్ధి, విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందించడంలో ప్రధానోపాధ్యాయులు కీలకపాత్ర వహించాలని ఎంపీడీఓ టి. స్వర్ణలత సూచించారు. స్థానిక మండల విద్యాశాఖ కార్యాలయంలో శుక్రవారం ప్రధానోపాధ్యాయులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపీడీఓ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సదుపాయల కల్పనకు ప్రాధాన్యతను ఇవ్వాలని చెప్పారు. పాఠశాల పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, మధ్యాహ్న భోజన పథకం అమలులో నాణ్యత ప్రమాణాలు పాటించాలని సూచించారు. ఎంఈఓ కొండా రవికుమార్ మాట్లాడుతూ ప్రభుత్వ పాఠశాలల్లో చదువుకునే ప్రతి విద్యార్థికీ ఆటోమెటిక్ పర్మినెంట్ అకాడమిక్ అకౌంట్ రిజిస్ట్రర్(అపార్) ఐడీ జనరేట్ చేయాలని సూచించారు. దీనివల్ల విద్యార్థులు తమ విద్యార్హత సర్టిఫికెట్లు, టీసీలు, ఇతర విద్యా సంబంధిత పత్రాలను ఆన్‌లైన్ ద్వారా పొందవచ్చని వివరించారు. ఎఫ్‌ఏ-1 పరీక్షలు ముగిసిన నేపథ్యంలో ఫలితాలను ఆన్‌లైన్ చేయాలని పేర్కొన్నారు. అనంతరం ఎంపీడీఓ స్వర్ణలతను విద్యాశాఖ అధికారులు, హెచ్‌ఎంలు సత్కరించారు. కార్యక్రమంలో ఎంఈఓ-2 కమల, బాపులపాడు ఎంఈఓ సురేష్ తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీఓ స్వర్ణలత

అర్జీలు పెండింగ్ లేకుండా పరిష్కరించాలి

కలెక్టర్ డీకే బాలాజీ

ఉంగుటూరు: ప్రజల నుంచి వచ్చిన అర్జీలు పెండింగ్ లేకుండా ఎప్పటికప్పుడు పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. ఉంగుటూరు తహసీల్దార్ కార్యాలయాన్ని శుక్రవారం కలెక్టర్ ఆకస్మిక తనిఖీ చేశారు. ఈ సందర్భంగా మీకోసంలో వచ్చిన అర్జీల పరిష్కారం వాటికి ఇచ్చిన ఎండార్స్‌మెంట్లు పరిశీలించారు. భూసమస్యలు, ఇళ్ల స్థలాల పంపిణీకి సంబంధించిన ఫైళ్లు, ఆర్‌ఓఆర్ రిజక్షన్స్, మ్యుటేషన్స్ ఫైళ్లు తనిఖీ చేశారు. కార్యక్రమంలో గుడివాడ ఆర్డీవో జి. బాలసుబ్రహ్మణ్యం, తహసీల్దార్ విమలకుమారి, టీడీపీ మండల అధ్యక్షుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.

కేసరపల్లిలో గృహ నిర్మాణాల పరిశీలన

గన్నవరం: మండలంలోని కేసరపల్లిలో పేదలకు ఇళ్ల స్థలాలు పంపిణీ చేసిన గృహ నిర్మాణాల లేఅవుట్‌ను శుక్రవారం జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ పరిశీలించారు. గృహ నిర్మాణాల పురోగతి గురించి అధికారుల నుంచి వివరాలు సేకరించారు. అనంతరం లబ్ధిదారులతో మాట్లాడిన కలెక్టర్ వారి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కాలనీలో రహదారులు, విద్యుత్, తాగునీరు వంటి మౌలిక సదుపాయల కల్పనకు చర్యలు తీసుకోవాలని అధికారులను ఆదేశించారు. కాలనీకి వెళ్లేందుకు సరైన రహదారి సదుపాయం లేదని, అప్పారావుపేట వద్ద ఏలూరు కాలువపై వంతెన నిర్మించాలని లబ్ధిదారులు కలెక్టర్‌ను కోరారు. గుడివాడ ఆర్డీఓ బాలసుబ్రహ్మణ్యం, గృహ నిర్మాణ శాఖ పీడీ ఎస్. వెంకట్రావు, తహసీల్దార్ వెంకటశివయ్య పాల్గొన్నారు.

పీఎం సూర్యఘర్ పథకంపై సమీక్ష

ఉంగుటూరు: పీఎం సూర్యఘర్ పథకం గురించి ప్రతి ఒక్కరికీ అవగాహన కల్పించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అధికారులకు సూచించారు. ఉంగుటూరు మండలం ఆత్కూరులోని స్వర్ణభారత్ ట్రస్ట్ సమావేశపు హాలులో పీఎం సూర్యఘర్ పథకంపై సంబంధిత అధికారులతో శుక్రవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పీఎం సూర్యఘర్ పథకం కింద ఆత్కూరు గ్రామాన్ని మోడల్ సోలార్ విలేజ్‌గా తయారు చేసేందుకు ప్రజలకు అవగాహన కల్పించాలని అధికారులను ఆదేశించారు. అనంతరం గ్రామంలోని ప్రాథమిక ఆరోగ్యకేంద్ర భవనాన్ని పరిశీలించారు. కార్యక్రమంలో గుడివాడ ఆర్డీవో బాలసుబ్రహ్మణ్యం, జెడ్పీ సీఈవో కన్నమనాయుడు, ఎల్డీఎం జయవర్ధన్, పీఎం సూర్యఘర్ పథకం నోడల్ అధికారులు, విద్యుత్ శాఖ అధికారి భాస్కర్‌రావు, నెడ్‌కాప్ అధికారి మౌలాలి, తహసీల్దార్ జె.విమలకుమారి పాల్గొన్నారు.



అర్జీదారుడితో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ



ఆత్కూరులో అధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ

12న గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ

కంకిపాడు: గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళిక తయారు చేయుటపై ఈనెల 12వ తేదీన స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో శిక్షణ కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ పి. అనూష తెలిపారు. శుక్రవారం ఆమె స్థానిక విలేకరులతో మాట్లాడారు. 2025-26 సంవత్సరానికి గ్రామ పంచాయతీ అభివృద్ధి ప్రణాళికపై శిక్షణ సాగుతుందన్నారు. మండలంలోని ఎంపీపీ, జెడ్పీటీసీ, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, డిజిటల్ అసిస్టెంట్లు, స్వయం సహాయక సంఘాల వీఓలు తప్పనిసరిగా హాజరుకావాలని సూచించారు. శిక్షణ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని కోరారు.

బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ అదృశ్యంపై కేసు నమోదు

పెనమలూరు: బ్యాంకు అసిస్టెంట్ మేనేజర్ అదృశ్యమైన ఘటనపై పోలీసులు శుక్రవారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ వెంకటరమణ తెలిపిన వివరాల ప్రకారం.. కానూరు మురళీనగర్‌కు చెందిన చెంగల్‌పట్టు వెంకట్రావు కుమారుడు చెంగల్ పట్టు రాంబాబు హనుమాన్‌జంక్షన్‌లోని బ్యాంకులో అసిస్టెంట్ మేనేజర్‌గా పని చేస్తున్నాడు. కాగా రాంబాబు భార్యతో విడాకులు తీసుకున్నాడు. భరణం కింద ఆమెకు సొమ్ము ఇవ్వడంతో ఆర్థిక ఇబ్బందుల్లో ఉన్నాడు. కాగా రాంబాబు గురువారం బ్యాంకుకు వెళ్లి తిరిగి ఇంటికి రాలేదు. తల్లిదండ్రులు ఫోన్ చేస్తే స్విచ్ఛాఫ్ వచ్చింది. ఈ ఘటనపై తండ్రి వెంకట్రావు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో కేసు నమోదు చేశారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

గన్నవరం: స్థానిక సబ్ స్టేషన్ నిర్వాహణ, విద్యుత్ లైన్ల మరమ్మతుల నిమిత్తం శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు గన్నవరం సెక్షన్ పరిధిలో విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు గుణదల ఈఈ పి. హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. గన్నవరం మొత్తం ఏరియా, మర్లపాలెం, చిన్నఆవుటపల్లి, దుర్గాపురం, ఎయిర్‌పోర్ట్ సిటీ, బీబీ.గూడెం, కొండపావులూరు, పురుషోత్తపట్నం, గొల్లనపల్లి, గోపవరపుగూడెం స్లేట్ స్కూల్ ఏరియా, చిక్కవరం ఇండస్ట్రీయల్ ప్రాంతాల్లో విద్యుత్ ఉండదని పేర్కొన్నారు.

పలు గ్రామాల్లో..

పెనమలూరు: పెనమలూరు సెక్షన్ పరిధిలోని విద్యుత్ లైన్ల మరమ్మతులు, గంగూరు సబ్‌స్టేషన్ నిర్వహణ కారణంగా శనివారం ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు పెనమలూరు, గంగూరు, గోసాల, వణుకూరు, చోడవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడుతుందని ఈఈ పి.హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. అలాగే తాడిగడప సబ్‌స్టేషన్ మరమ్మతుల కారణంగా తాడిగడప శ్రీనివాస నగర్ కట్ట, పద్మజా నగర్, లిప్రా కాలనీ, కార్మిక నగర్, ఎస్‌టీబీఎల్ కాలనీల్లోనూ, పెదపులిపాక, తాడిగడప గ్రామాల్లో వ్యవసాయ విద్యుత్‌కు సైతం ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకు అంతరాయం ఉంటుందన్నారు. పోరంకి సెక్షన్ పరిధిలో మరమ్మతుల కారణంగా పెనమలూరు సెంటర్, పోరంకి, బాలాజీ నగర్, సాలిపేట వెంకటేశ్వర గార్డెన్స్, పద్మావతి ఫేస్ 1-3, శ్రీనివాస నగర్, సీతాపురం కాలనీ, బీజేఆర్ నగర్, విష్ణుపురం కాలనీ, ప్రభు నగర్‌ల్లో ఉదయం ఎనిమిది నుంచి 11 గంటల వరకూ విద్యుత్ సరఫరా నిలుపుదల చేస్తామని చెప్పారు. కానూరు సెక్షన్ పరిధిలో ఉదయం ఏడు నుంచి తొమ్మిది గంటల వరకు ఎంపీ కాలనీ, పంట కాలువ రోడ్డు, సనత్ నగర్, కామయ్యతోపు సెంటరు, 80 అడుగుల రోడ్డు, బందరు రోడ్డులో కొంత ఏరియాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

రామవరప్పాడు: విజయవాడరూరల్ మండలంలోని పలు గ్రామాల్లో శనివారం ఉదయం ఎనిమిది నుంచి మధ్యాహ్నం 12గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేయనున్నట్లు ఈఈ పి. హరిబాబు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. నున్న, బోడపాడు, కుందావరి కండ్రిక, పాతపాడు, సీతారామపురం, మంగళపురం, అప్పారావు పేట, నైనవరం గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని పేర్కొన్నారు.

కంకిపాడు: ఈడుపుగల్లు, కంకిపాడు విద్యుత్ సబ్‌స్టేషన్ల పరిధిలో లైన్ల మరమ్మతుల కారణంగా శనివారం ఉదయం తొమ్మిది నుంచి 11 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలివేయనున్నట్లు ఈఈ పి. హరిబాబు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈడుపుగల్లు, కంకిపాడు, పునాదిపాడు గ్రామాల్లో విద్యుత్ సరఫరా ఉండదని చెప్పారు.

నిత్యావసర ధరల పెంపుతో ప్రజలపై భారం

ఉయ్యూరు: నిత్యావసర ధరలు పెంచి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రజలపై మోయలేని భారం మోపుతున్నాయని సీపీఎం రాష్ట్ర నాయకుడు ఎం. హరిబాబు అన్నారు. ఉయ్యూరు పట్టణంలోని నిమ్మాది ఏడుకొండలు నగర్‌లో సీపీఎం పార్టీ పట్టణ ఏడవ మహాసభ శుక్రవారం నిర్వహించారు. హరిబాబు మాట్లాడుతూ ఉచిత ఇసుక, నూతన మద్యం పాలసీతో రాష్ట్రాన్ని దోచుకుంటున్నారన్నారు. బాలికలు, మహిళలపై దాడులు, అకృత్యాలు కూటమి ప్రభుత్వ కళ్లకు కనిపించడం లేదా అని ప్రశ్నించారు. సీపీఎం నాయకులు ఇస్మాయిల్, రాజేష్, లక్ష్మణరావు, బాల గంగాధర్‌తిలక్, గోపాల్ పాల్గొన్నారు.

ఇష్టపడి చదివితే ఉత్తమ మార్కులు సాధ్యం

డీవైఈవో పద్మావతి

హనుమాన్‌జంక్షన్ రూరల్: ఇష్టపడి చదివితే ఉత్తమ మార్కులు సాధ్యమని గుడివాడ డీవైఈవో పద్మారాణి అన్నారు. బాపులపాడు, రేమల్లే జెడ్పీ హైస్కూళ్లను శుక్రవారం ఆమె తనిఖీ చేశారు. ఆయా పాఠశాలల్లో విద్యార్థులు, ఉపాధ్యాయుల హాజరు, రికార్డులు, మధ్యాహ్న భోజనం తదితర అంశాలను పరిశీలించారు. అనంతరం టెన్త్, ఇంటర్మీడియట్ విద్యార్థులతో ముచ్చటించారు. పబ్లిక్ పరీక్షలకు సమాయత్తం అయ్యే విద్యార్థులు ఇప్పటి నుంచే చక్కటి ప్రణాళిక రూపొందించుకుని, పట్టుదలతో చదవాలని డీవైఈవో సూచించారు. ఎంఈవో శ్రీరామ్ బాలాసింగ్, బాపులపాడు, రేమల్లే జెడ్పీ హైస్కూళ్ల ప్రధానోపాధ్యాయులు తోట వెంకట నాగేశ్వరరావు, ఎస్.లూథర్‌పాల్ పాల్గొన్నారు.



బాపులపాడు జెడ్పీ హైస్కూల్‌లో ఇంటర్ విద్యార్థులతో మాట్లాడుతున్న డీవైఈవో పద్మావతి

పశువుల్లో గర్భోత్పత్తి సమస్యల నివారణకు చర్యలు

పశుగణాభివృద్ధి సంస్థ డెప్యూటీ డైరెక్టర్ కె. శ్రీనివాసులు

గన్నవరం రూరల్: పశువుల్లో గర్భోత్పత్తి సమస్యల నివారణకు ప్రభుత్వం చర్యలు తీసుకుంటుందని పశుగణాభివృద్ధి సంస్థ (ఎగ్జిక్యూటీవ్ ఆఫీసర్ లైవ్ స్టాక్ డెవలప్‌మెంట్ ఏజెన్సీ) డెప్యూటీ డైరెక్టర్ కె. శ్రీనివాసులు పేర్కొన్నారు. రాష్ట్రీయ గోకుల్ మిషన్, జాతీయ కృత్రిమ గర్భధారణ కార్యక్రమంలో భాగంగా సూరంపల్లిలో శుక్రవారం గర్భకోశ వ్యాధుల చికిత్సా శిబిరం నిర్వహించారు. శిబిరంలో ఆయన మాట్లాడుతూ తిరిగి పొర్లే పశువులకు, గర్భం దాల్చని పశువులకు పరీక్షలు నిర్వహించి చికిత్స చేయాలన్నారు. రైతులు దీనిపై విస్తృత అవగాహన కలిగి ఉండాలని చెప్పారు. అల్లాపురం పశుసంవర్ధక శాఖ ఏడీఏ డాక్టర్ ఎం. బాలకృష్ణ మాట్లాడుతూ పశుగణనలో పాడి రైతులందరూ పూర్తి వివరాలను నమోదు చేసుకోవాలన్నారు. పశుసంవర్ధక శాఖ హెల్ప్‌లైన్ నెంబర్ 1962ను సంప్రదించవచ్చని చెప్పారు. సర్పంచ్ ఈలప్రోలు శ్రీనివాస్, పాలకేంద్రం అధ్యక్షుడు ఈలప్రోలు రాంబాబు, మాజీ అధ్యక్షుడు కాసరనేని సత్యన్నారాయణ, ముస్తాబాద, గొల్లనపల్లి పశువైద్య చికిత్సా కేంద్రాల డాక్టర్లు మేరీ వైడూర్యం, రెడ్డెమ్మ తదితరులు పాల్గొన్నారు.



రాష్ట్ర స్థాయి క్రీడా పోటీలకు ఎంపిక

హనుమాన్‌జంక్షన్ రూరల్: స్కూల్ గేమ్స్ ఫెడరేషన్ ఆధ్వర్యంలో నిర్వహించనున్న రాష్ట్ర స్థాయి నెట్‌బాల్, బేస్‌బాల్ పోటీలకు బాపులపాడు జెడ్పీ హైస్కూల్ విద్యార్థులు ఎంపికైనట్లు హెచ్‌ఎం తోట వెంకట నాగేశ్వరరావు శుక్రవారం తెలిపారు. అండర్-14 విభాగంలో సాఫ్ట్‌బాల్ బాలుర జట్టుకు కొండా తిరుమల గోపిచంద్, బాలికల జట్టుకు వేమండ సుకన్య ఎంపికైయ్యారని చెప్పారు. అండర్-14 బేస్‌బాల్ బాలుర జట్టుకు కాళీదాసు సంతోష్‌కుమార్, పఠాన్ హానీఫ్, బాలికల జట్టుకు ప్రజాపతి సాక్షికుమారి, అండర్-17 బేస్‌బాల్ బాలుర జట్టుకు వెలివెల మారుతీమహేష్, శ్రీకాకొల్లు సుకుమార్, షేక్ అహ్మద్‌బాషా, నల్లపోతుల అక్షయ్, కొడాలి దీవెన రాజు, పల్లపు సన్నీ, బాలికల జట్టుకు రమాకూరి కావ్యశ్రీ, పిల్లి స్నేహలత, బందారు ఇందు ఎంపికైనట్లు పేర్కొన్నారు. రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు ప్రవంతి ఛారిటబుల్ ట్రస్ట్ తరుపున రూ. 7 వేలు నగదును చైర్మన్ వీరమాచినేని సత్యప్రసాద్ అందించారు. క్రీడాకారులను హెచ్‌ఎం వెంకట నాగేశ్వరరావు, పీఈటీ పామర్తి వెంకటేశ్వరరావు, రిటైర్ట్ పీఈటీ రాఘవేంద్రరావు అభినందించారు.



రాష్ట్రస్థాయి పోటీలకు ఎంపికైన విద్యార్థులకు నగదు ప్రోత్సాహకం అందిస్తున్న సత్యప్రసాద్

275 బస్తాల బియ్యం స్వాధీనం

కంకిపాడు: మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలో గల ఓ గోదాములో నిల్వ ఉంచిన బియ్యాన్ని అధికారులు శుక్రవారం రాత్రి స్వాధీనం చేసుకున్నారు. సుమారు 275 బస్తాలు (135 క్వింటాళ్లు) బియ్యం స్వాధీనం చేసుకుని నిర్వాహకులపై 6ఏ కింద కేసు నమోదుచేశారు. వివరాల్లోకి వెళితే.. మండలంలోని ఈడుపుగల్లు గ్రామంలోని ఓ గోదాములో అక్రమంగా రేషన్ బియ్యం నిల్వ ఉంచినట్లు సమాచారం అందడంతో పౌరసరఫరాల శాఖ, తూనికలు, కొలతల శాఖ అధికారులు తనిఖీలు నిర్వహించారు. ఈ తనిఖీల్లో గోదాములో 275 బస్తాల బియ్యం ఉన్నట్లు గుర్తించారు. ఈ బియ్యం రేషన్ బియ్యమా?, నిల్వ చేసేందుకు అనుమతులు ఉన్నాయా? అన్న కోణంలో అధికారులు దర్యాప్తు చేస్తున్నారు. ఈ విషయమై డీఎస్‌ఓ పార్వతి విలేకరులతో మాట్లాడుతూ బియ్యం నిల్వపై 6ఏ కేసు నమోదు చేశామని, రేషన్ బియ్యంగా నిర్ధారణ జరిగితే చర్యలు కఠినంగా ఉంటాయని స్పష్టంచేశారు.

